క్లుప్తంగా

మిర్చి యార్డును సందర్శించిన వ్యవసాయ కళాశాల విద్యార్థులు

కొరిటిపాడు(గుంటూరు): బాపట్ల వ్యవసాయ కళాశాల రెండో సంవత్సరం విద్యార్థులు స్టడీ టూర్‌లో భాగంగా గురువారం గుంటూరు మార్కెట్ యార్డును సందర్శించారు. వ్యాపార లావాదేవీల నిర్వహణ, రైతుల రాక,టర్నోవర్, యార్డులో ఎగుమతి, దిగుమతి వ్యాపారుల సంఖ్య, రైతుల నుంచి సెస్సు వసూలు, మౌలిక సదుపాయాల కల్పన, రైతులకు గిట్టుబాటు ధర లభిస్తుందా? లేదా? అని అధికారుల్ని వివరాలు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల ప్రశ్నలకు మార్కెట్ యార్డు ఉన్నత శ్రేణి కార్యదర్శి ఐ.వెంకటేశ్వరరెడ్డి, చైర్మన్ నిమ్మకాయల రాజనారాయణ వివరంగా సమాధానమిచ్చారు.

హాస్టల్ విద్యార్థులకు మెస్, కాస్మొటిక్ చార్జీలు పెంచాలి

గుంటూరు ఎడ్యుకేషన్: సంక్షేమ హాస్టళ్లలో విద్యార్థులకు మెస్, కాస్మొటిక్ చార్జీలను పెంచాలని పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు యు. గనిరాజు విజ్ఞప్తి చేశారు. జెడ్పీ వద్ద ఉన్న సంక్షేమ భవన్ ప్రాంగణంలోగురువారం పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా గనిరాజు మాట్లాడుతూ ప్రస్తుతం చెల్లిస్తున్న ధరలు విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించేందుకు సరిపోవడం లేదని తెలిపారు. అనంతరం వివిధ సమస్యలపై బీసీ సంక్షేమ అధికారి వై. నర్సారెడ్డికి వినతి పత్రం సమర్పించారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ నాయకులు విజయ్, లోకేష్, రజాక్, జగదీష్, శ్రీను పాల్గొన్నారు.

వ్యక్తి మృతిపై కేసు నమోదు

గుంటూరు ఈస్ట్: ఇంటిలో జారిపడి గాయపడిన వ్యక్తి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటనపై పట్టాభిపురం పోలీసులు కేసు నమోదు చేశారు. గుజ్జనగుళ్లకు చెందిన అరగల వెంకట్రావు (48) గురువారం బాత్‌రూంలో జారిపడటంతో తలకు గాయమైంది. ఆయన్ను భార్య ధనలక్ష్మి ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించింది. వెంకట్రావు చికిత్స పొందుతూ అక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని మార్చురీకి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విలేజ్ క్లినిక్‌కు శానిటైజర్లు, మాస్కులు అందజేత




గుంటూరు రూరల్: జొన్నలగడ్డ గ్రామ విలేజ్ హెల్త్ క్లినిక్‌కు వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు వంగా నవీన్‌రెడ్డి 500లు లెక్కన శానిటైజర్లు, మాస్కులు, గ్లౌవ్‌లను అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ శివాచారి మాట్లాడుతూ గ్రామంలోని ప్రజలు వ్యక్తిగత , పరిసరాల పరిశుభ్రత పాటించాలన్నారు. ఎటువంటి ఆరోగ్య సమస్య వచ్చినా వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచించారు. చల్లని పదార్థాలను తగ్గించి వేడిగా తీసుకోవాలన్నారు. చేతులు పరిశుభ్రంగా ఉంచుకోవాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ డి.జీవనజ్యోతి, గ్రామప్రజలు పాల్గొన్నారు.

ఉర్దూ పాఠశాల తనిఖీ



చేబ్రోలు: గొడవర్రు, చేబ్రోలు గ్రామాల్లోని ఉర్దూ ప్రాథమిక పాఠశాలలను ఉర్దూ ఉప తనిఖీ అధికారి ఎండీ ఖాసీం గురువారం సందర్శించారు. గొడవర్రులోని పాఠశాలలో విద్యార్థుల ప్రగతి పత్రాలు, ఎఫ్‌ఏ–1 మార్కులను పరిశీలించారు. ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. పరీక్షల్లో అత్యధిక మార్కుల సాధించిన విద్యార్థుల్ని ఆయన అభినందించారు. చేబ్రోలులోని పాఠశాలలో మధ్యాహ్న భోజనం తనిఖీ చేశారు. పాఠశాలకు హాజరైన విద్యార్థులందరూ భోజనం చేయటంపై హెచ్‌ఎం, ఉపాధ్యాయులను అభినందించారు.

నారాకోడూరు పాఠశాల తనిఖీ



చేబ్రోలు: నారాకోడూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను తెనాలి డివిజన్ ఉప విద్యాశాఖాధికారిణి ఎం.నిర్మల గురువారం ఆకస్మిక తనిఖీ చేశారు. హైస్కూల్‌లో జరుగుతున్న నాడు – నేడు పాఠశాల పనులను పరిశీలించారు. జగనన్న విద్యా కానుకను తనిఖీ చేశారు. విద్యార్థులందరూ తప్పనిసరిగా యూనిఫామ్‌తో పాఠశాలకు హాజరుకావాలని సూచించారు. మధ్యాహ్న భోజనాన్ని రుచి చూశారు. ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. విద్యార్థులకు ఉపకరణాలతో అర్థవంతంగా బోధించాలని సూచించారు. ఉపాధ్యాయులు అంకితభావంతో పనిచేయాలని ఆమె పేర్కొన్నారు. విధుల్లో అలసత్వం, నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు. హెచ్‌ఎం ఎం.ఏడుకొండలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బాధ్యతతో ప్రజల సమస్యల్ని పరిష్కరించాలి

ఎమ్మెల్యే ముస్తఫా



అధికారులకు సూచనలిస్తున్న ఎమ్మెల్యే ముస్తఫా

పట్నంబజారు: ప్రజా సమస్యల పరిష్కారంలో అధికారులు బాధ్యతగా వ్యవహరించాలని తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే షేక్ మొహమ్మద్ ముస్తఫా సూచించారు. నియోజకవర్గంలోని గుంటూరువారితోట, రామిరెడ్డితోట, ఆర్టీసీ బస్టాండ్ పరిసర ప్రాంతాల్లో గురువారం ఆయన పర్యటించారు. ఆయా ప్రాంతాల్లో పారిశుద్ధ్య పనులు, పరిశుభ్రతను పరిశీలించారు. స్థానికుల నుంచి సమస్యలు అడిగి తెలుసుకుని, వాటిని నేరుగా అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. గుంటూరువారితోటలో డ్రైనేజీ లీక్ సమస్యను త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. దీంతో అధికార యంత్రాంగం మరమ్మతులు నిర్వహించి పనులు పూర్తి చేసింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ముస్తఫా మాట్లాడుతూ తూర్పు నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకువెళుతున్నట్లు చెప్పారు. దశల వారీగా అన్ని ప్రాంతాల్ని అభివృద్ధి దిశలో పయనించేలా దృష్టి సారించినట్లు తెలిపారు. నియోజకవర్గంలో కుల,మత, ప్రాంత, రాజకీయ భేదాలు లేకుండా అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయని పేర్కొన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డిని తిరిగి సీఎంని చేసేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నేతలు, నగరపాలక సంస్థ అధికారులు, సచివాలయాల సిబ్బంది పాల్గొన్నారు.

పెయింటింగ్ అసోసియేషన్ సభ్యుల వినతి

ది పెయింటింగ్ ఆర్ట్స్ వర్కర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కమిటీ సభ్యులు గురువారం తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే షేక్ మొహమ్మద్ ముస్తఫాను కలసి సమస్యల్ని వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం ద్వారా వాల్ ఆర్ట్స్, డివైడర్ పెయింటింగ్ పనులు చేసుకునే వారిని ఆదుకోవాలని విన్నవించారు. తూర్పు నియోజకవర్గానికి సంబంధించి ఎటువంటి పనులున్నా..కార్మికులకు అందేలా నగరపాలక సంస్థ కమిషనర్ దృష్టికి తీసుకువెళ్లి కృషి చేస్తామని ఎమ్మెల్యే తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మహిళా నేత షేక్ నూరి ఫాతిమా, అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

మహేష్‌బాబు జన్మదిన వేడుకలు

సినీ నటుడు మహేష్‌బాబు జన్మదినాన్ని పురస్కరించుకుని బ్రహ్మానందరెడ్డి స్టేడియం సమీపంలోని ఎమ్మెల్యే కార్యాలయంలో గుంటూరు కృష్ణ, మహేష్‌బాబు ఫ్యాన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. ఎమ్మెల్యే ముస్తఫా, వైఎస్సార్ సీపీ నేత నూరిఫాతిమా కేక్‌ను కట్ చేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ నేతలు చెన్నయ్య, కొండేబోయిన శ్రీను పాల్గొన్నారు.

చదువుల విప్లవం తెచ్చిన ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్

ప్రముఖ క్రికెటర్ అంబటి తిరుపతి రాయుడు



గ్రంథాలయంలో పుస్తకాలను పరిశీలిస్తున్న అంబటి రాయుడు

గుంటూరు ఎడ్యుకేషన్: రాష్ట్రంలో చదువుల విప్లవం తెచ్చిన ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ విద్యావ్యవస్థను అభివృద్ధి బాట పట్టించారని ప్రముఖ క్రికెటర్ అంబటి తిరుపతి రాయుడు పేర్కొన్నారు. అరండల్‌పేటలోని జిల్లా కేంద్ర గ్రంథాలయ సంస్థను గురువారం అంబటి రాయుడు సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులు, పాఠకులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కనీస వసతులకు నోచుకోని ప్రభుత్వ పాఠశాలల్లో అరకొర సదుపాయాల నడుమ చదువు కొనసాగించాల్సిన పరిస్థితుల్లో కోట్లాది రూపాయల ఖర్చుతో పాఠశాలల్ని ఆధునీకరించిన సీఎం వై.ఎస్. జగన్‌కు పేద, బడుగు, బలహీనవర్గాల విద్యాభివృద్ధిపై ఎంతో చిత్తశుద్ధి ఉందని తెలిపారు. రాష్ట్రంలో చేపట్టిన విద్యా మహాయజ్ఞం ద్వారా ప్రభుత్వ పాఠశాలలు అభివృద్ధి చెందిన తీరు గతంలో ఎన్నడూ చూడలేదని, పెరిగిన విద్యార్థులతో పాఠశాలలు కళకళలాడుతున్నాయని పేర్కొన్నారు. గ్రంథాలయాల్ని సైతం ఎంతో అద్భుతంగా తీర్చిదిద్దడంతో పాటు పాఠకులు, పోటీ పరీక్షలకు సన్నద్ధమవుతున్న ఉద్యోగార్థులకు అవసరమైన పుస్తకాలు, మెటీరియల్‌ను ఏర్పాటు చేయడం గొప్ప విషయమని ప్రశంసించారు. చదువు విలువ తనకు తెలుసునని, చిన్నతనంలో జరిగిన పలు విషయాల్ని ఆయన గుర్తు చేసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కేంద్ర గ్రంథాలయంలో నిరుద్యోగ యువతకు నిర్వహిస్తున్న గ్రూప్–1, 2 శిక్షణ తరగతులకు హాజరైన అభ్యర్థులు అడిగిన పలు ప్రశ్నలకు ఆయన సమాధానాలిచ్చారు. కుల, మతాలకు అతీతంగా సమాజాభివృద్ధిని కాంక్షించే వారిగా ఎదగాలని విద్యార్థులకు సూచించారు. ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాల్ని సద్వినియోగం చేసుకుని, పోటీ పరీక్షలకు సన్నద్ధం కావాలని ఆయన సూచించారు. జిల్లా కేంద్ర గ్రంథాలయంలో పాఠకులు, పోటీ పరీక్షల శిక్షణార్థుల ప్రయోజనార్థం ఏసీలతో పాటు స్టడీ మెటీరియల్ అందజేస్తామని అంబటి రాయుడు హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన్ను జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బత్తుల దేవానంద్ శాలువా కప్పి సత్కరించారు. కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ కార్యదర్శి కె. ఝాన్సీలక్ష్మి, గ్రంథ పాలకులు కె. చిన్నపరెడ్డి, ఎస్. నాగిరెడ్డి, ఐ.వి.దుర్గారెడ్డి, అర్బన్ బ్యాంకు డైరెక్టర్ బందా రవీంద్రనాథ్, వైఎస్సార్ సీపీ ఐటీ విభాగ అధ్యక్షుడు మాదాసు కిరణ్, సుధీర్, ఉద్యోగులు పాల్గొన్నారు.

వేపనూనెతో పచ్చదోమ నివారణ

ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ శ్రీలతావాణి



నడింపాలెంలో పత్తి పంటను పరిశీలిస్తున్న ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ శ్రీలతావాణి

ప్రత్తిపాడు: పైర్లను ఆశిస్తున్న పచ్చదోమను నివారించేందుకు రైతులు వేపనూనెను పిచికారీ చేయాలని ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ శ్రీలతావాణి అన్నారు. మండల పరిధిలోని ప్రత్తిపాడు, యనమదల, నడింపాలెం గ్రామాల్లో గురువారం ఏరువాక కేంద్రం శాస్త్రవేత్తలు క్షేత్ర సందర్శన చేశారు. పత్తి పంటను పరిశీలించారు. రైతులతో మాట్లాడారు. పంటను ఆశిస్తున్న చీడపీడలను పరిశీలించారు. రైతుల సందేహాలను నివృత్తి చేసి పలు సూచనలు అందించారు. డాక్టర్ శ్రీలతావాణి మాట్లాడుతూ ప్రస్తుతం బెట్ట పరిస్థితులు నెలకొనడంతో కొన్ని ప్రాంతాల్లో పచ్చదోమ పంటను ఆశిస్తుందన్నారు. నివారణకు ఒక లీటరు వేపనూనెను ఎకరా పంటలో పిచికారీ చేయాలన్నారు. ఆర్థిక నష్ట పరిమితిని అనుసరించి పచ్చదోమ నివారణకు 200 లీటర్ల నీటిలో 60 గ్రాములు ఫ్లోనికామైడ్ కలిపి ఎకరాకు లేదా 250 గ్రాముల డైఫెన్ థియురాన్‌ను ఎకరాకు పది రోజుల వ్యవధిలో రెండు సార్లు పిచికారీ చేసుకోవాలని రైతులకు సూచించారు. డాట్ సెంటర్ కో–ఆర్డినేటర్ డాక్టర్ జి. కిశోర్‌బాబు మాట్లాడుతూ పత్తి పంటలో సమగ్ర ఎరువుల యాజమాన్యం చేపట్టాలని, ఎకరాకు మూడు బస్తాల యూరియా, ఒక బస్తా డీఏపీ, ఒక బస్తా మ్యూరేట్ ఆఫ్ పొటాష్ వాడాలని చెప్పారు. యూరియాను మూడు భాగాలుగా చేసి మొక్క 20–30 రోజుల సమయంలో ఒకసారి, 60 రోజుల సమయంలో రెండవసారి, 90 రోజుల సమయంలో మూడవ సారి చల్లాలన్నారు. యూరియా వాడిన ప్రతిసారీ 15–20 కిలోల ఎంవోపి తప్పనిసరిగా వాడాలని రైతులకు సూచించారు. వెంట ఏపీఏ గోపి తదితరులు పాల్గొన్నారు.

ఆర్వీఆర్‌జేసీలో అధ్యాపకులకు శిక్షణ తరగతులు

గుంటూరు రూరల్: సాంకేతిక విద్యా వ్యవస్థలో వస్తున్న ఆధునిక మార్పులకు అనుగుణంగా ఉపాధ్యాయులు ఎప్పటికప్పుడు శిక్షణ పొందటం ఎంతో అవసరమని ఆర్వీఆర్‌జేసీ ఇంజినీరింగ్ కళాశాల అధ్యక్షుడు డాక్టర్ ఆర్.శ్రీనివాస్ తెలిపారు. గురువారం చౌడవరంలోని కళాశాలలో అధ్యాపకులకు డేటా సైన్స్ అండ్ అనలిటిక్స్‌పై శిక్షణ తరగతులు ప్రారంభించారు. ఈ సందర్భంగా కళాశాల అధ్యక్షుడు మాట్లాడుతూ ఎప్పటికప్పుడు అధ్యాపకులు శిక్షణ పొందుతుండటం ద్వారా విద్యార్థులకు సులభతరంగా విద్యాబోధన చేయవచ్చన్నారు. కళాశాల సెక్రటరీ కరస్పాండెంట్ ఆర్.గోపాలకృష్ణ, ట్రెజరర్ డాక్టర్ కె.కృష్ణప్రసాద్ మాట్లాడుతూ తాడేపల్లిగూడెం, వరంగల్‌లోని ఎన్ఐటీ కళాశాలలకు చెందిన అనుభవజ్ఞులైన నిపుణులతో శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నామన్నారు. గుంటూరు, కృష్ణ, ప్రకాశం జిల్లాల్లోని వివిధ కళాశాలల అధ్యాపకులు 43 మంది పాల్గొన్నారు.

రేపటి నుంచి కళాపీఠం గోల్డెన్ జూబ్లీ వేడుకలు



ఆహ్వాన పత్రికను ఆవిష్కరిస్తున్న లక్ష్మీనారాయణ, రామచంద్రరాజు

పాత గుంటూరు: అమరావతి రోడ్డులోని హిందూ ఇంజనీరింగ్ కళాశాలలో ఈ నెల 12, 13 తేదీల్లో కళాపీఠం గోల్డెన్ జూబ్లీ వేడుకల్ని ఘనంగా నిర్వహించనున్నట్లు సంస్థ అధ్యక్షుడు ఎస్.వి.ఎస్. లక్ష్మీనారాయణ తెలిపారు. గనగరంపాలెంలోని రెడ్‌క్రాస్ భవన్‌లో గురువారం కార్యక్రమాల ఆహ్వాన పత్రికను ఆవిష్కరించారు. అనంతరం విలేకరుల సమావేశంలో లక్ష్మీనారాయణ మాట్లాడుతూ 12న ఉదయం 10 గంటకు ప్రారంభమయ్యే కార్యక్రమంలో ముఖ్య అతిథిగా హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ యు. దుర్గాప్రసాద్ పాల్గొంటారని తెలిపారు. తెలుగు రాష్ట్రాలకు చెందిన 50 మంది ప్రముఖ చిత్ర కళాకారులు పాల్గొని ప్రదర్శనలిస్తారని పేర్కొన్నారు. రెండు రోజుల పాటు సాయంత్రం 6 గంటల వరకు ఆర్ట్ ఎగ్జిబిషన్, వర్క్ షాప్ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. సమావేశంలో రెడ్‌క్రాస్ వైస్ చైర్మన్ పి. రామచంద్రరాజు, కళాపీఠం కార్యదర్శి, ఎస్. విజయ్‌కుమార్, సభ్యులు ఉస్మాన్‌ఖాన్ పాల్గొన్నారు.

లైఫ్ హాస్పిటల్‌లో అరుదైన శస్త్రచికిత్స



మాట్లాడుతున్న డాక్టర్ కల్యాణ్ చక్రవర్తి, పక్కన డాక్టర్ హేమంత్, డాక్టర్ సుధీర్ చక్రవర్తి

గుంటూరు మెడికల్: ప్రమాదంలో తలకు గాయమై మెదడులో ఆర్టిరియో వీనస్ ఫిస్టుల్లా ఉన్న రోగికి అరుదైన ఆపరేషన్ చేసి ప్రాణాలు కాపాడినట్లు లైఫ్ హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్, ఇంట్రవెన్షనల్ న్యూరాలజిస్ట్ డాక్టర్ సజ్జా కల్యాణ్ చక్రవర్తి చెప్పారు. స్థానిక కొత్తపేట ఓల్డ్ క్లబ్ రోడ్డులోని లైఫ్ హాస్పిటల్‌లో గురువారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. గుంటూరు జిల్లా ప్రత్తిపాడు మండలం గొట్టిపాడు గ్రామానికి చెందిన 61 ఏళ్ల గ్రంధి పద్మావతి గతనెలలో కుడి కన్ను పూర్తిగా వాచిపోయి చూపు కోల్పోయే స్థితిలో తమ వద్దకు చికిత్స కోసం వచ్చిందని తెలిపారు. ఆమెకు పరీక్షలు చేసి మెదుడుకు దెబ్బ తగలడం ద్వారా బ్రెయిన్‌లో ఫిస్టుల్లా ఏర్పడిందని నిర్ధారించామని చెప్పారు. మైక్రోక్యాథటర్ ద్వారా బ్రెయిన్ బోన్‌కు డ్రిల్ చేసి గమ్‌ను(గ్లూ) ఇంజెక్ట్ చేశామని వివరించారు. గతనెల 19న సుమారు రెండు గంటలసేపు ఎంబోలైజేషన్ సర్జరీ చేసి రోగి ప్రాణాలు కాపాడామని పేర్కొన్నారు. సుమారు రూ.6లక్షల ఖరీదు చేసే ఆపరేషన్‌ను డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకం ద్వారా ఉచితంగా చేశామని చెప్పారు. ఆపరేషన్ తరువాత కన్నువాపు పూర్తిగా తగ్గిపోయి చూపు బాగా కనిపిస్తోందని, సకాలంలో చేయకపోతే రక్తం బ్రెయిన్‌లోకి వెళ్లి ప్రాణాలకే ప్రమాదం ఏర్పడేదని తెలిపారు. అత్యంత అరుదైన పద్ధతిలో చేసిన ఈ ఆపరేషన్ విధానాన్ని అమెరికాలో జరిగిన ఎస్ఎన్ఐఎస్ అంతర్జాతీయ సదస్సులో ప్రజెంట్ చేశామని ఆయన వెల్లడించారు. తమ హాస్పిటల్‌లో సజ్జా ఫౌండేషన్ ద్వారా ఉచితంగా త్రోంబెక్టమీ ఆపరేషన్లు చేస్తున్నామని, ప్రజలు ఈ వైద్యసేవల్ని వినియోగించుకోవాలని ఆయన కోరారు. సమావేశంలో న్యూరోసర్జన్ డాక్టర్ హేమంత్, డాక్టర్ సుధీర్ చక్రవర్తి పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



మొక్కలు నాటుతున్న వీసీ డాక్టర్ ఎ.విష్ణువర్ధన్‌రెడ్డి



మొక్కలు నాటుతున్న కళ్ళం ఇంజినీరింగ్ కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఉమాశంకర్‌రెడ్డి



తురకపాలెంలో మొక్కలు నాటుతున్న జెడ్పీటీసీ సుబ్బారావు, వైస్ ఎంపీపీ పద్మావతి

వ్యవసాయ విశ్వ విద్యాలయం ఉప కులపతి విష్ణువర్ధన్‌రెడ్డి

గుంటూరు రూరల్: పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యతని ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వ విద్యాలయం ఉప కులపతి డాక్టర్ ఎ విష్ణువర్ధన్‌రెడ్డి తెలిపారు. గురువారం నగర శివారులోని లాంఫాం నందున్న విశ్వవిద్యాలయంలో మన భూమి – మనదేశం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడారు. దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణాలను అర్పించిన త్యాగధనులను స్మరించుకోవడం పుణ్యమన్నారు. అనంతరం విశ్వ విద్యాలయం ఆవరణలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో పరిశోధన సంచాలకురాలు డాక్టర్ ఎల్ ప్రశాంతి, రిజిస్ట్రార్ డాక్టర్ జి.రామారావు, అసోసియేట్ డీన్ డాక్టర్ చైతన్యకుమారి, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ దేశభక్తిని కలిగి ఉండాలి

గుంటూరు రూరల్: ప్రతి ఒక్కరూ దేశభక్తిని కలిగి ఉండాలని గుంటూరు రూరల్ మండలం జెడ్పీటీసీ తుమ్మల సుబ్బారావు తెలిపారు. గురువారం మండలంలోని తురకపాలెం గ్రామంలో మన భూమి – మన దేశం కార్యక్రమాన్ని నిర్వహించారు. స్వాతంత్ర్య అమరవీరుల చిత్రపటాలకు పూల మాలలు వేసి, నివాళులర్పించారు. వైస్ ఎంపీపీ ఇంటూరి పద్మావతి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ పర్యావరణ పరిరక్షణ బాధ్యతగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ డబ్బూరి సూర్యప్రకాశరావు, గ్రామ సచివాలయం సిబ్బంది పర్యావరణ పరిరక్షణ ప్రతిజ్ఞ చేశారు. చిన్నపలకలూరు గ్రామంలో ఆజాదీకా అమృత్ మహోత్సవం ముగింపు సందర్భంగా గురువారం జాతీయ జెండా ఆవిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామంలోని వీరజవాన్ తీర్థాల సైదులు సతీమణి తీర్థాల వెంకాయమ్మను ఘనంగా శాలువాతో సత్కరించారు. అనంతరం గ్రామంలో సచివాలయం ఆవరణలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో గ్రామ సెక్రటరీ జోస్న, వీఆర్వో ప్రసన్నకుమార్, ఎం.వెంకటేశ్వర్లు, శ్రీను, నరేష్ పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు కృషిచేయాలి

గుంటూరు రూరల్: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కళ్ళం ఇంజినీరింగ్ కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎం. ఉమాశంకర్‌రెడ్డి తెలిపారు. గురువారం చౌడవరం గ్రామంలోని కళాశాలలో కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో మన భూమి–మనదేశం కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా కళాశాల ఆవరణలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా డైరెక్టర్ మాట్లాడుతూ స్వాతంత్ర్యం కోసం ప్రాణాలను అర్పించి అమరుల త్యాగాలను వివరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ బీఎస్‌బీ రెడ్డి, డాక్టర్ ఎం.సతీష్‌కుమార్, డి.శ్రీనివాసులు, గిరిబాబు, భరత్‌కుమార్ తదితరులున్నారు.

ఏటీఎం కార్డులు మార్చి నగదు దోపిడీ

పట్నంబజార్: మహిళల్ని మోసం చేసి ఏటీఎం కార్డుల్ని మార్చి నగదు దొంగిలించిన సంఘటనలపై కేసు నమోదైంది. కొత్తపేట పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చిన్నగంజాంకు చెందిన రాయిని శివలక్ష్మి మనుమరాలికి అనారోగ్యంగా ఉండటంతో కొత్తపేటలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి వచ్చారు. డబ్బులు అవసరమై జులై 14న బోసుబొమ్మ సెంటర్ సమీపంలోని కొటక్ మహేంద్ర బ్యాంకు ఏటీఎంకు వెళ్లారు. తీయడం రాకపోవడంతో పక్కనే ఉన్న ఓ వ్యక్తిని నగదు తీసి పెట్టాలని అడగడంతో ఆమె ఏటీఎం కార్డు ద్వారా రూ.10వేలు తీసిచ్చాడు. అనంతరం అసలు కార్డును అతడు ఉంచుకుని నకిలీని ఇచ్చాడు. ఈ క్రమంలో ఈ నెల 8న బ్యాంకుకు వెళ్లిన ఆమెకు అకౌంట్‌లో నగదు లేదని, గుంటూరులో డ్రా చేశారని సిబ్బంది చెప్పడంతో బాధితురాలు పోలీసుల్ని ఆశ్రయించగా, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మొత్తం రూ.55వేలు పోయినట్లు బాధితురాలు ఫిర్యాదులో పేర్కొన్నారు.

■ ఏటీఎంలోనే నకిలీ కార్డును ఇచ్చి మరో మహిళను మోసం చేసిన ఘటనపై కొత్తపేట పోలీసులు కేసు నమోదు చేశారు. కల్యాణం వారి వీధిలో నివాసం ఉండే చింతా రమాదేవి భర్తకు అనారోగ్యంగా ఉండటంతో జులై 12న కొత్తపేటలోని యూనియన్ బ్యాంకు ఏటీఎంలో డబ్బులు తీసేందుకు వెళ్లారు. ఆమెకు కూడా డబ్బులు తీయడం రాకపోవడంతో గుర్తు తెలియని వ్యక్తి తీసిస్తానంటూ నమ్మబలికి , కార్డు మార్చి వేశాడు. అనంతరం ఆమె అకౌంట్ నుంచి రూ.29వేలు మాయమైనట్లు గుర్తించి, గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చిన్నారి మృతి

పట్నంబజార్: చికిత్స పొందుతూ రెండేళ్ల చిన్నారి మృతి చెందిన సంఘటపై కేసు నమోదైంది. నల్లచెరువు 23 లైన్‌కు చెందిన షేక్ సనా కౌసరి (2) ఈ నెల 2న ప్రమాదవశాత్తు వేడినీళ్ల బకెట్లలో పడి తీవ్రంగా గాయపడింది. ఈ క్రమంలో అప్పటి నుంచి గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న చిన్నారి బుధవారం మృతి చెందింది. తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

ఇద్దరు బైక్ దొంగల అరెస్టు

నిందితుల్లో ఒకరు మైనర్



స్వాధీనం చేసుకున్న వాహనాల వివరాలను తెలియజేస్తున్న సీఐ రమేష్‌బాబు

తెనాలి రూరల్: చెడు వ్యసనాలకు అలవాటు పడి బైక్ దొంగతనాలకు పాల్పడుతున్న ఇద్దరిని పోలీసులు అరెస్టు చేశారు. వీరిలో ఒకరు మైనర్ ఉన్నాడు. కేసు వివరాల్ని త్రీ టౌన్ సీఐ ఎస్. రమేష్‌బాబు గురువారం సాయంత్రం వెల్లడించారు. గుంటూరు నెహ్రూనగర్‌కు చెందిన వేముల రేణుకారావు అలియాస్ పండు మరో 14 ఏళ్ల బాలుడు స్నేహితులు. చెడు వ్యసనాలకు బానిసలైన వీరు ఖర్చులకు డబ్బుల కోసం బైక్‌లను అపహరించడం ఎంచుకున్నారు. ఇద్దరు కలసి తెనాలి బుర్రిపాలెం రోడ్డులో ఉంటున్న బాలుడి అక్క ఇంటికి ఇటీవల వచ్చారు. పినపాడు, చెంచుపేట డొంక రోడ్డు, మోరిస్‌పేటలో మూడు బైక్‌లను అపహరించుకెళ్లారు. బైక్ యజమానులు పోలీసుల్ని ఆశ్రయించగా కేసు నమోదు చేసిన పోలీసులు నిందితుల ఆచూకీ కోసం ప్రయత్నించారు. చివరకు వీరిని గుర్తించి కదలికలపై నిఘా ఉంచారు. స్థానిక జేఎంజే కళాశాల ఎదురు రోడ్డులో ఉన్నారని తెలుసుకుని సీఐ రమేష్‌బాబు, ఎస్ఐ కె. వెంకటేశ్వరరావు, కానిస్టేబుళ్ల రంజిత్, అంకయ్య అక్కడకు వెళ్లి నిందితుల్ని అదుపులోకి తీసుకున్నారు. విచారణలో వారిచ్చిన సమాచారం మేరకు మూడు వాహనాల్ని స్వాధీనం చేసుకున్నారు.

స్కాలర్‌షిప్‌లకు దరఖాస్తుల ఆహ్వానం

తెనాలి అర్బన్: కృష్ణదేవరాయ ఎడ్యుకేషనల్ ప్రోగ్రెసివ్ అసోసియేషన్ తెనాలి డివిజన్ ఆధ్వర్యంలో ప్రతిభావంతులైన పేద విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు ఇవ్వనున్నట్లు సంస్థ కార్యదర్శి తాడికొండ చిన్నబ్బాయి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పదో తరగతి, ఇంటర్, పాలిటెక్నిక్, డిగ్రీ, ఇంజినీరింగ్‌లలో అత్యధిక మార్కులు సాధించిన పేద విద్యార్థులు ఈ నెల 27లోపు దరఖాస్తులు అందజేయాలని ఆయన పేర్కొన్నారు. వివరాలకు 9440438904, 98491216687లో సంప్రదించాలని సూచించారు.

విద్యార్థుల ఆరోగ్యంపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ



విద్యార్థులతో ఆల్బెండజోల్ మాత్రలు మింగిస్తున్న ఎంఈవో సీహెచ్ రమాదేవి

ప్రత్తిపాడు: విద్యార్థుల ఆరోగ్యంపై రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నారని ఎంఈవో సీహెచ్. రమాదేవి అన్నారు. మండలంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో విద్యార్థులకు గురువారం ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ చేశారు. గొట్టిపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ కెజియాగ్రేస్ ఆధ్వర్యంలో సూపర్‌వైజర్లు, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు విద్యాశాఖ అధికారులు, ప్రధానోపాధ్యాయులతో కలసి విద్యార్థులకు, అంగన్‌వాడీ కేంద్రాల్లోని చిన్నారులకు మాత్రలను మింగించారు. ఆల్బెండజోల్ మాత్రలను మింగడం వల్ల నులిపురుగులను నివారించవచ్చని మండల విద్యాశాఖాధికారి సీహెచ్ .రమాదేవి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆయాలు, అంగన్‌వాడీలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నామినేషన్ల ప్రక్రియ పూర్తి

గుంటూరు రూరల్: చల్లావారిపాలెం గ్రామ పంచాయతీ 5వ వార్డుకు, ఓబులునాయుడుపాలెం 8వ వార్డుకు నామినేషన్ల స్వీకరణ పూర్తయిందని ఎన్నికల అధికారి రమేష్ గురువారం తెలిపారు. ఈ నెల 8 నుంచి 10వ తేదీ వరకూ నామినేషన్ల స్వీకరణ చేపట్టగా చల్లావారిపాలెంలో 5వ వార్డుకు చల్లా వెంకటరెడ్డి, ఓబులునాయుడుపాలెంలో 8వ వార్డుకు పొత్తూరు విక్టోరియా నామినేషన్లు దాఖలు చేశారని ఆయన పేర్కొన్నారు. రెండు చోట్లా ఒక్కరు మాత్రమే నామినేషన్లు అందజేసినట్లు సమాచారం.

ఆల్బెండజోల్ మాత్రలతో నులిపురుగుల నివారణ

గుంటూరు రూరల్: నులిపురుగుల నివారణకు ప్రతి ఒక్కరూ ఆల్బెండజోల్ మాత్రలు తీసుకోవాలని జొన్నలగడ్డ గ్రామ సర్పంచ్ మబ్బు శిరీష తెలిపారు. గురువారం గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా ఆల్బెండజోల్ మాత్రలను అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రతి చిన్నారి ఆరోగ్యంగా జీవించాలని నులిపురుగుల నివారణ మాత్రలు అందిస్తున్నారన్నారు. కార్యక్రమంలో ఏఎన్ఎం జీవనజ్యోతి, హెచ్ఎం రాజేశ్వరి, వంగా నవీన్‌రెడ్డి, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.